# వార్నింగ్

కాంతారావు గడపదాటి వస్తూంటే - కమ్మని కల నిజమైనంత సంతోషపడింది కమల.

"మీ కోసం కండ్లల్ల వత్తులేసుకుని చూస్తున్నా తెల్సా !" కాటుక కళ్ళనూ, దొండపండు పెదాలనూ, కమ్మగా తిప్పేస్తూ - కాఫీ కప్పు అందించబోయింది.

రోజుట్లాగే ఫ్యాక్టరీనుండి రాగానే కాఫీ కప్పందుకుని చక్కిలిగింతలు పెడతాడనుకుంది. అతన్లో స్పందన లేక పోయేసరికి ముద్దమందారం లాంటి మొహం వాడిన కలువలాగైంది.

పోలీసు కస్టడీలో ముద్దాయిలా అడుగులేస్తూ వచ్చి కుర్చీలో కూలబడ్డాడు కాంతారావు.

కాకినాడ కాంతారావు, కరీంనగర్ కమల మెడలో మూడు ముళ్ళేశాక సంసారక్షేత్రములో కలల పంట పండించుకునే రోజులవి.

నేనేమన్నా పొరపాటు చేసిన్నా ? పెండ్లైన ఆర్నెల్లకే చిరాకులు పరాకులా ? కమలకేదోలాగుంది.

"ఏమైందీ ... డల్‌గా ఉన్నారెందుకూ ?" అంటూ నుదిటి మీద చెయ్యేసి చూసింది. జ్వరమేమీ లేదు.

"మా ఫ్యాక్టరీలో సమ్మె జరుగబోతుంది కమలా ! లాకౌట్ దాకా వస్తుందటా ... " అంటూ పైకి చూస్తున్నాడు.

"అట్లనా ? " ఆశ్చర్యపడుతూ కాఫీ కప్పు పెదాల కందించింది. సగం చల్లారిన కాఫీ గటగటా తాగేసి

"ప్చ్ ... ముందు సమ్మె అంటే సరదాగా ఉండేది. ఇప్పుడేమో ..." నిట్టూర్చాడు.

"అప్పుడు ఒంటరివి. ఇప్పుడు జంటగా నేనున్నాను. నాలుగైదు నెలల్లో తండ్రవుతున్నారు..." సిగ్గుతో చెక్కిలి ఎరుపెక్కింది. అదే చెక్కిలి మీద చిటికేస్తూ అన్నాడు -

"అందుకేనేమో నాలో ఏదో ఆరాటం. కానీ...ఇదో ప్రిస్టేజి సమస్యై కూచుంది కమలా!"

"సమ్మెకు ... కారణం? " అడుగుతూ పక్కన నేల మీద కూచుంది.

"కారణం నేనే !" అనేశాడు. కమల కనురెప్పలు తుమ్మెద రెక్కల్లా టపటపలాడినై.

"మీరా ... అసలేం జరిగిందో చెప్పుండ్రీ !" అంటూ దగ్గరికి జరిగింది.

"సరే విను " కాంతారావు ప్రారంభించాడు. "అలవాటు ప్రకారం డ్యూటీకి అరగంట లేటుగా వెళ్లాను. కొత్తగా వచ్చిన సూపర్‌వైజర్ వేణుగోపాల్ ఆమాత్రానికే కొంపలంటుకుపోయినట్టు

"ఏం కాంతారావూ ఎందుకింత లేటూ ?" అని మొహమ్మీద అడిగేశాడు.

"అడగడామరి. అదాయన డ్యూటీగదా !"

"డ్యూటీయో, బ్యూటియో ... ఇంతవరకు నన్నెవ్వరూ అలా అడగలేదు. యూనియన్ ఆఫీసు బేరర్‌నన్న మర్యాదగూడా లేకుండా అలా అడిగేసరికి ఒళ్లు మండిందనుకో.

'మన సామ్మేమీ పోలేదుగాని గమ్మునూరుకోండి సార్' అన్నాను. అప్పుడన్నా ఊరుకున్నాడా! లేదు. తగుదునమ్మా అంటూ ఇలా ఆలస్యంగా వస్తే క్రమశిక్షణా చర్య తీసుకుంటానని వార్నింగిచ్చాడు. కడుపు మండి పోయిందనుకో !"

కమలకేమాత్రం నచ్చలేదా ధోరణి.

"ఐతే మీరేం జేసింద్రూ ?" అడిగింది.

"ఛడా మడా నాల్గు ఝాడించి వార్నింగ్ వాపస్ తీసుకొమ్మని డిమాండ్ చేశా. అతడొప్పుకోలేదు. నేనో అమాయక చక్రవర్తి ననుకున్నాడేమో అర్భకుడు ... అప్పటి కప్పుడా వార్త ఫ్యాక్టరీ మొత్తం కార్చిచ్చులా వ్యాపింపజేశాను. మా యూనియన్ లీడర్లను తీసుకుని యం.డి. దాకా వెళ్లాను. యం.డి. వేణుగోపాల్‌కు కబురు పెట్టాడు. అప్పుడా వేణుగోపాలేంజేశాడో తెల్సా ?"

"ఏం జేసిండండీ ?" కళ్లు ఆల్చిప్పలైపోయినై.

"సూపర్‌వైజర్ల యూనియన్ లీడర్లను వెంటేసుకొచ్చాడు."

"మీ యూనియన్ మీకుంటే వాళ్ల యూనియన్ వాళ్లకుంటుంది గదా ! అంతదాకా పోయింగ్రా ? "

"కాపోతే నీ మొగుడేమన్నా మొద్దు రాచిప్ప అనుకున్నావా ?"

"మొద్దు కాదుగానీ ముద్దుగా చెప్పుంగ్రీ !"

"చెబుతున్నా వినవోయ్ ! మేమిద్దరం చెప్పిందీ, మా యూనియన్ల నాయకుల వాదనలూ విని యం.డి. నన్నే అతనికి క్షమాపణ చెప్పుమన్నాడు." మాటల్లో కసి తొంగి చూచింది.

హమ్మయ్య ! మంచి పంజేసింద్రు ! అనుకుంది. పైకి మాత్రం

"ఊఁ ... తర్వాత !" అంది.

"ఇంకేముంది ! ఓ యూనియన్ ఆఫీసు బేరర్ క్షమాపణ చెప్పడమంటే తలకొట్టేసుకున్నట్టే గదా !

"ఐతే ... క్షమాపణ చెప్పనేలేదా?"

"లేదు. చెప్పనంటే చెప్పనన్నాను. అంతే కాదు వార్నింగిచ్చినందుకు వేణుగోపాల్ చేత క్షమాపణ చెప్పించుమని డిమాండు చేశాం. అలా చెప్పించకపోతే సమ్మె చేస్తామన్నాం. అతడొప్పుకోలేదు వాళ్లయూనియన్ నాయకులతనికే వత్తాసు పలికారు."

"ఎవరి యూనియన్ వాళ్లదిక్కు మాట్లాడ్తాంది."

"ఔననుకో ! వారం రోజుల్లో వేణుగోపాల్ చేత క్షమాపణ చెప్పించక పోతే వాళ్లు సమ్మె చేస్తామని నోటీసిచ్చినారు. యాజమాన్యం దాన్నో ప్రిస్టేజి ఇష్యూగా తీసుకుంది. వారం రోజుల్లోగా.

సమస్య పరిష్కారం కాకపోతే లాకౌట్ విధిస్తామంది."

వేపకాయ నమిలినట్టుంది కమలకు.

"అయ్యయ్యో ! గోరుతో పొయ్యేదాన్ని గొడ్డలిదాకా తెచ్చింద్రా ? గిట్లైతే మన దేశమేమైపోతదో గదా !" అంది గాబరాగా.

"ఓహో ! స్వాతంత్ర్య సమరయోధుని ముద్దుల కూతురివి గదూ ! నీ కలాగే అన్పిస్తుందిలే. ఒక్క మా ఫ్యాక్టరీ సమ్మెతోనే దేశంలో ఉత్పత్తి తగ్గి పోతుందా ?" కొట్టిపారేశాడు.

" ఎవలకు వాళ్లు గిట్ల మా ఒక్కఫ్యాక్టరీ అనుకుంటే ...ఇట్లా ఎన్ని జరుగుతున్నాయో !" కమల అంతరంగము అతలాకుతలమైంది. "స్వాతంత్ర్యం వచ్చినంక మన దేశమెంతో ప్రగతి సాధించింది గాని పారిశ్రామిక రంగముల అనుకున్నంత సాధించలేక పోయింది. గిందుకేనేమో ! స్వాతంత్ర్య స్వర్ణోత్సవాలు జరుపుకుంటున్న గీసమయము లోనన్నా ఆలోచించాలండీ !" బతిమాలింది.

మాటల్లోని నిజం ఈటెలా గుచ్చుకుందేమో "అబ్బా ! ఇక చాలించు నీ నస !" అన్నాడు చిరాగ్గా.

"నస కాదండీ ! నా ఆత్మ ఘోష" ఎడమ చేత్తో అతని గదవ పైకెత్తి "మా మంచిశ్రీవారు గదూ ! నేనడిగిందానికి జవాబులు చెప్తారు. మరి కోపానికి రావద్దూ ...!" కుడి చేత్తో ముక్కు లాగి వదిలేసింది.

ఆహా ! ఎంత హాయి ! హానీమూన్‌లో హార్సిలీ హిల్స్‌లో విహరిస్తున్నట్టుంది.

"అడగవోయ్ ... చెబుతాను !" అన్నాడు.

"మీ ఫ్యాక్టరీలో ఎంత మంది పంజేస్తున్నారూ ?"

"మేమో ఐదొందలు, సూపర్‌వైజర్లో వంద. మిగతా వాళ్లో యాభై " టకటకా చెప్పేశాడు.

"అంతా కలిసి ఆరొందల యాభై. మీలాంటి యూనియన్ ఆఫీసు బేరర్లను ఆదర్శంగా తీసుకుని అందర్రూ తలా ఓ అరగంట ఆలస్యంగా డ్యూటీ కొచ్చారనుకోండి. రోజుకెన్ని పని గంటలు నష్టమైపోతుంటై ?" క్విజ్ మాస్టారులా అడిగింది.

"మూడొందలరవయ్యో..దు గంటలు. అంటే రోజుకు పదమూడున్నర రోజులు పైగా పనిదినాలు" మనొసెందుకో గతుక్కుమంది.

"అంటే సంవత్సరానికి సుమారు ఐదువేల పనిదినాలు మీ ఒక్కఫ్యాక్టరీలోనే హుష్కాకై పోతుంటే దేశం మొత్తమ్మీద ఉత్పత్తి ఎంత దెబ్బదింటుందో చెప్పండ్రి !" సూటిగా అడిగింది.

అమ్మ బాబోయ్ ! ఇలా ఎన్నడూ ఆలోచించ లేదే ! కాంతారావు గుండె గుబగుబ లాడింది.

"ఐతే దేశానికి బోలెడంత నష్టం. దీని వల్లనే కావచ్చు బోనస్ గూడా తగ్గిపోతుంది". నోరెల్ల బెట్టాడు.

"ఔను. పోయిన సారికంటే ఈ సంవత్సరం మీకు బోనస్ తక్కువొచ్చింది గదూ !"

"నిజమే కమలా ! మా సెక్షన్లో వర్కర్లంతా ఆలస్యంగా వస్తున్నారు. వాళ్ళందరికిదే సంగతి చెప్పాలిహ."

"ఆఁ ... మరో సంగతి. మీరు ఒంటరిగా ఉన్నప్పుడెట్లా గడిచిందో గాని ఇప్పుడు మనం రెండున్నర మనుషులం. ఫ్యాక్టరీ బంద్దైపోతే రోజులెట్లా గడువాలె ? ఆలోచించుండ్రి !" అంటూ తలనిమిరింది. అప్పుడే

"ఉన్నావా కాంతారావ్ !" అంటూ యూనియన్ సెక్రెటరీ దానయ్య దూసుకొచ్చాడు.

"రా అన్నా ! రా !" కమల కుర్చీ చూపించింది. లోపలికెళ్లి కాఫీ తెచ్చి ఇచ్చింది.

"చెప్పు కాంతారావ్ ! నోటీసైతే ఇచ్చినాం గాని సమ్మెనెట్లా సక్సెస్ చేద్దామో చెప్పు" అడిగాడు దానయ్య కాఫీ సిప్ చేస్తూ.

అయోమయంగా ఉంది కాంతారావుకు

"అదేందీ గట్లున్నవూ ! మొకమ్మీద ఆ కళ లేదేందీ ?" ఖాళీ కప్పు కమల కందిస్తూ ఆశ్చర్యపోయాడు దానయ్య.

"ఔను. ఇంటికొచ్చాక నా బుర్రనేదో తొలిచేస్తుంది. ఒకవైపు ప్రిస్టేజి, మరోవైపు పసలేని ఆవేశం .... " మొహమెత్తలేక పోయాడు.

"ఐతే ... మా చెల్లెమ్మేదో మంత్రమూదిందన్నమాట! " దానయ్య దృష్టి కమల వైపు మళ్లింది. కమల మొహం కడిగిన ముత్యంలాగుంది.

"మంత్రం కాదన్నా మంత్రాంగం మాట్లాడుకున్నం." కమల అందుకుంది. "అసలూ ... పొరపాటు మా ఆ.. య .. న ... దేనేమో !"

"నాగ్గూడా అట్లే అన్పించింది చెల్లెమ్మా. కాని అక్కడ మీ ఆయన చెప్పినట్టు సమ్మెనోటీసివ్వక తప్పలేదు." నవ్వేశాడు. ఆ నవ్వులో జీవం లేదు.

"కాదన్నా, మీరప్పుడీయనకు నచ్చజెప్తే బాగుండేది గదా !"

"అయ్యోరామ! నీ మొగుడు మాకు మొండి మొగుడమ్మా ! చెప్తే వినే రకమా ! తన మాటే సాగాలంటాడు. పంతాల మారిగదూ !"

"ఒక్కల పంతం కోసం గంతమందిని పరేషాన్ జెయ్యడం బాగుంటుందా అన్నా ?" నిలదీసింది.

"పరేషానో, పంచదారనో ! ఇప్పుడనుకుంటే ఏం లాభం ?" పెదాలు చప్పరించాడు దానయ్య.

"అది గాదన్నా ! ప్రతి ఫ్యాక్టరీల గిట్లనే జరిగిందనుకో. దేశం గతేమై పోవాలె ?"

"ఆ సంగతీ ... నీ మొగున్నడగాలమ్మా !"

"ఇప్పుడీ అనర్థాన్నాపలేమా దానయ్యా ?" అడిగాడు కాంతారావు. పచ్చిమిరపకాయ పంటికింది కొచ్చినట్టైంది దానయ్యకు.

" ఆహాఁ ! ఇదేమన్నా పొల్లగాండ్ల ఆటనుకున్నవా ?" గుర్రు మన్నాడు.

❖ ❖ ❖

సూపర్‌వైజర్ వేణుగోపాల్ ఇల్లు సందడిగా ఉంది. సూపర్‌వైజర్ల యూనియన్ కార్యదర్శి చంద్రశేఖర్, ఫ్యాక్టరీ వెల్ఫేరాఫీసర్ రమణమూర్తి అక్కడే ఉన్నారు. కాంతారావు, దానయ్యలు కలిసి వస్తూంటే పసిపిల్లకు సర్కస్ సింహాలు కనబడినట్టు - వింతగా చూస్తున్నారంతా.

ఏదో పెద్ద ప్లాన్ మీదనే వచ్చుంటారు. ఇంకా బయటెంత మందిని ఉంచొచ్చారో ! ఏంజేస్తారో ఏమో ! - వేణుగోపాల్‌కు భయమేసింది.

అబ్బో ! ఇక్కడ వీళ్లంతా నాగురించే ఏదో ప్లాన్ చేస్తున్నట్టుంది. రేపు నన్ను సస్పెండ్ చేస్తారేమో ! భగవంతుడా ... కాపాడు తండ్రీ ! - మనసులోనే మొక్కుకున్నాడు కాంతారావు.

అంతా కూచున్నారు. ఎవ్వరూ నోరెత్తడంలేదు. మూడు నిముషాలు నిశ్శబ్దంగా గడిచినై.

"చెప్పండి దానయ్య గారూ ! సమ్మె జరిగి తీరాల్సిందేనంటారా ?" ఆప్యాయంగా అడిగాడు వెల్ఫేరాఫీసర్ రమణమూర్తి.

"అదంతా సూపర్‌వైజర్ల యూనియన్ కెరక. రెక్కలు ముక్కలు జేసుకుంటున్న మావోళ్లంతా సూపర్‌వైజర్ల మోచేతి నీళ్లు తాగుతున్నారనుకుంటున్నారు." గుడగుడలాడాడు దానయ్య. అతని మాటల్లోని ఎత్తిపొడుపు అందరికీ అర్థమైంది.

అబ్బో ! ఇతడసాధ్యుడు. పీకలు తెగ్గోసే రకం - వేణుగోపాల్ నరాల్లోని వణుకు ఆనవాళ్లు మొహమ్మీద చెమట రూపంలో కన్పిస్తున్నై. అతని చూపులు వాళ్ల నాయకుడు చంద్రశేఖర్ వైపు మళ్లాయి.

"మామూలు వర్కర్లకే అంత రోషముంటే మా సూపర్‌వైజర్లకు మాత్రం చీమూనెత్తురు లేదా ?" ప్రశ్నించాడు చంద్రశేఖర్.

"అది కాదండీ. మనమంతా ఒక్కచోట పనిజేస్తున్నాం. ఇందులో ఒకరెక్కువ, మరొకరు తక్కువనే భావనెందుకూ ?" రమణమూర్తి. మాటల్లో సౌజన్యముంది" మనమంతా శ్రామికులం. దేశహితం కోసం, మనపొట్ట కోసం పంజేస్తున్నాం. శ్రామికుల్లో అవగాహన లోపం దేశపారిశ్రామిక రంగానికి చెదలు లాంటిది. స్వాతంత్ర్య సమరములో భారతమాత పాదాల చెంత ప్రాణాలర్పించిన సమరయోధులు ... ఈ దేశానికి స్వాతంత్ర్యం, రాగానే స్వర్గధామమై పోతుందని కలలు గన్నారు. వారి కలలు కల్లలు కావద్దుగదా ! ప్రపంచదేశాల్లో మనదేశం ముందుండాలంటే పారిశ్రామిక ప్రగతి ఎంతో ముఖ్యం. చీటికి - మాటికీ, తుమ్మితే - దగ్గితే మనం సమ్మెకు దిగితే పారిశ్రామిక ప్రగతి సంగతేమిటి ?" ఆవేశంగా ప్రశ్నించాడు.

కాంతారావు - వేణుగోపాల్, దానయ్య - చంద్రశేఖర్‌లు చూపులతో పరామర్శించుకున్నారు.

"నిజమే కానీ .... " ఇంకేమీ అనలేక పోయాడు వేణుగోపాల్.

"నామాట వినండి. పోరు నష్టం పొందు లాభం అన్నారు పెద్దలు" మళ్లీ రమణమూర్తే అందుకున్నాడు. "కాడర్ ఏదైనా కార్మికులంతా ఒకటే. దేశమంతా స్వాతంత్ర్య స్వర్ణోత్సవాల్లో మునిగుంటే మనమేంజేస్తున్నామో బాగా ఆలోచించండి."

"హక్కుల కోసం పోరాడుతున్నాం !" అన్నాడు దానయ్య తాపీగా.

"అర్థంపర్థం లేని హక్కుల్ని మరిచి అసలు హక్కులకు దూరం కావద్దు. హక్కుల పోరాటంతో పాటు బాధ్యతల ఆరాటం గూడా ఉండాలి. అధికోత్పత్తి చూపిస్తూ దేశప్రగతికి బాటలు వెయ్యడం మన బాధ్యతకాదా ?"

ఆ ప్రశ్న చంద్రశేఖర్ గుండెలకు తాకింది.

"నిజమే ! మా వేణుగోపాల్ గారు కాస్త నిదానించి ఉంటే ఇంతవరకొచ్చేది గాదు." అభిప్రాయం వెలిబుచ్చాడు.

"కాదు నేనే తొందర పడ్డాను " తపీన లేచాడు కాంతారావు వేణుగోపాల్ చేతుల్ని కళ్లకద్దుకుంటూ "నన్ను మన్నించండి సార్ ! ఎక్కడంటే అక్కడ క్షమాపణ కోరుతాను " అన్నాడు.

వేణుగోపాల్ ఎదపొంగింది. కడిగిన గుండెలు కరిగిపోయిన్నై.

"లేదు కాంతారావ్ ! నేను కాస్త సంయమనం పాటిస్తే సరిపోయేది. వార్నింగ్ వాపస్ తీసుకుంటున్నా. ఎక్కడంటే అక్కడ క్షమాపణ కోరుతా " అంటూ గుండెలకు హత్తుకున్నాడు.

బందరులడ్డూ, కాకినాడ కాజా కలిపి తిన్నట్టైంది రమణమూర్తికి.

"ఇది చాలు. మీరెవ్వరూ ఇంకెక్కడా క్షమాపణ కోరాల్సిన అవసరం లేదు. యూనియన్ కార్యదర్శులిద్దరూ సమ్మె నోటీసు వాపస్ తీసుకుంటున్నట్టు ... ఇదిగో కాయితాలు రెడీ. వీటిమీద సంతకాలు చేసిస్తే సరి ..." అంటూ కాయితాలందించాడు.

ఇద్దరు కార్యదర్శులు చిరునవ్వుతో సంతకాలు చేసిచ్చారు.

"అవగాహన లోపముతో ఆదరబాదరాగా సమ్మెకు దిగే కార్మికులకిదో వార్నింగ్ లాంటిది.' ' అన్నాడు రమణమూర్తి - తన బాధ్యతను తాను నెరవేర్చినందుకు మురిసిపోతూ.

గోడగడియారం టంగుమని తొమ్మిదిన్నరైందని గుర్తుచేసింది.

"మన స్వాతంత్ర్య స్వర్ణోత్సవాలు మన మధ్య ఇప్పుడే ప్రారంభమైపోయిన్నై. ఈ శుభసందర్భంగా అందరి నోళ్లు తీపి కావాలి గదా !" అంటూ శ్రీమతి వేణుగోపాల్ తలా ఓ స్వీటు అందించింది.

**ఆకాశవాణి హైదరాబాదు ప్రత్యేక ప్రసారం.**

**13-08-1997.**